కథానిక:

# [illegible]



సాయంత్రం ఆరుగంట లవుతోంది. శారద వీథిఅరుగుమీదకు వచ్చి ఆకాశంలోకి చూసింది. ఆకాశంమీద దట్టంగా అలము కొన్న ఆషాఢమేఘాలు వడివడిగా పరుగెడు తున్నాయ్. వర్షాగమనాన్ని సూచించే చల్లని పిల్లగాలి, ఆమె ముంగురులతో సయ్యాటలాడుతోంది. ఆమె అతి చేల తనంగా ఆకాశంలోకి చూస్తూ నిలబడింది. మూర్తి ఇంకా ఆఫీసునుండి రాలేదు. రోజూ ఈపాటికే వచ్చేవారు. ఏం చెప్మా! ఇంకా రాలే దీవాళ! అనుకుంది శారద. భర్తవిషయం జ్ఞాపకం వచ్చేసరికి, అప్పటి వరకూ నిర్మలంగా ఉన్న ఆమెమానసాకాశంలో భావమేఘాలు దట్టంగా క్రమ్ము కున్నాయి. చిటపటమంటూ చిన్న పువ్వుల వర్షం కూడా ప్రారంభ మయింది.

వాకిట్లో చెంగల్వలన్నీ మొగ్గలతో పొట్టలు పగలడానికి సిద్ధంగా ఉన్నాయి. శారద మెట్లు దిగి నాలు గడుగులు వేసి ఒక చెంగల్వబోదదగ్గర నిలబడింది మొగ్గలు చూస్తూ. ఒక మొగ్గ తెంపబోయింది శారద. అప్పుడే ప్రళయనిర్ఘాతంలా ఎక్కడో పడింది ఒక పిడుగు ధనధనా మని.

పెనుగాలికి విరిగిపోయిన లేత గన్నేరు కొమ్మలా కంపించిపోయింది శారద — కెవ్వున కేక వేసి రెండు చెవులూ మూసుకుంది.

అప్పుడే, "అర్జునః ఫల్గునః పార్థః" అంటూ మెట్లెక్కి వచ్చాడు మూర్తి. "ఏం శారదా! భయపడ్డావా పిడుగుశబ్దానికి." అంటూ ఆమెను సమీపించాడు.

## శ్రీ యర్రమిల్లి చలపతిరావు "శ్రీవత్సవ"

అశనిపాతంతో, కర్ణకఠోరంగా, ధ్వనించిన శబ్దానికి చెంగల్వ మొగ్గలన్నీ, పొట్టలు పగిలి ఒక్కసారిగా విడిచాయి. "చూడండి పిడుగుశబ్దానికి నా గుండెలు బ్రద్దలయాయి. చెంగల్వమొగ్గ తెంప బోయాను. పాపం ఈ చెంగల్వకన్నా హృదయంకూడా బ్రద్దలయింది. చూడండి, మొగ్గలన్నీ ఒక్కసారి ఎలా విడిచాయో" అంది శారద.

"అందుకనే స్త్రీలు కుసుమకోమలు లన్నారు. రా పోదాం" అంటూ పకపక నవ్వేడు మూర్తి. శారద, విడిచిన ఒక చెంగల్వ పువ్వును త్రెంపి, మూర్తిచేతి కందిస్తూ, "చూడండీ, ఎంత అందంగా ఉందో" అంది అమాయకంగా.

మూర్తి చిరునవ్వు నవ్వుతూ, "ఇది నీ జడలో, ఇంకా అందంగా, కనుపిస్తుంది." అన్నాడు.

ఇద్దరూ మెట్లెక్కి లోపలికి వచ్చారు.

కుంపటిమీద కాఫీనీళ్లు త్రెళ్లుతున్నాయి. మూర్తి ఎదురుగా వున్న కుర్చీలో కూలబడి వార్తాపత్రికను ముఖానికి అడ్డంగా పెట్టుకుని వార్తాప్రపంచంలో మునిగిపోయాడు.

శారద కాఫీకలుపుతూ "ఏమండీ, జీతాలు ఇవ్వాళా ఇవ్వలేదుటండీ?" అంది ... ప్రత్యుత్తరంకోసం యెదురుచూడ్డంలో పది నిమిషాలు గడచాయి. కాని మూర్తి జవాబు ఇవ్వలేదు. కాఫీగ్లాసు చేతి కందిస్తూ, ఏమండీ అడిగినదానికి జవాబైనా యివ్వరేం? మంచివారండీ? ఈవేళనా తగలేశారా లేదా జీతంరాళ్లు?" అంది శారద.

మూర్తి కాఫీగ్లాసు అందుకుంటూ, "ఈ వాళా యివ్వకపోవాలీ! జీతంరాళ్లూ తగలేశారు ఈ వేళతో ఉద్యోగానికీ స్వస్తి జరిగింది." అన్నాడు.

శారద నిర్ఘాంతపోయింది. "ఏమిటీ ఉద్యోగానికి స్వస్తా!" అంది ఆశ్చర్యంగా.

"అవును. పదిహేనవతారీఖైనా జీతాలు యివ్వకపోతే యెలా యేడవడం? నెల్లాళ్లూ ఒళ్ళు వంచి పనిచేస్తే, ఆ తగలేసే నల్లఖై రాళ్లయినా ఫస్టుతారీఖునాటికి ఖచ్చితంగా తగలేస్తేగాని వీల్లేదని చెప్పాను మేనేజరుతో. కాస్త సీరియస్‌గానే చెప్పాను. అతడు మాట్లాడకుండా నలభై రూపాయిలూ ఇచ్చి, "మొదటితారీఖునాటికే జీతం దొరికే ఇంకో ఉద్యోగం ఏదయినా చూసుకోండి రేపటి నుంచి. మాకూ ఈమధ్య లాభాలు తగ్గా

యాయి అన్నాడు. తర్వాత విచారించాను నేను పొరపాటు చేశానని. మళ్ళీ అడుగుదాం అనుకున్నాను. ఇంత హఠాత్తుగా ఉద్యోగం మానిపించేస్తే ఏం చెయ్యాలని. కాని, వెధవ ఆత్మాభిమానం! అదే నా జీవితాన్ని ఇలా నాశనం చేస్తోంది. దాన్ని విడిచిపెట్టేస్తే యీపాటికి నేనూ అందరిలాగే సంపాదించేవాణ్ణి. వెధవ డబ్బు" అంటూ నిట్టూర్చాడు మూర్తి.

శారదముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు. "పోనీ! ఇంకో ఉద్యోగం ఏదయినా దొరికేదాకా, యీ నెల్లాళ్ళయినా, ఉండనివ్వమని అడగలేకపోయారుటండీ? ఎందుకొచ్చిన అభిమానం? అభిమానం ఉంటే కూడుపెడుతుందంటండీ? ఈ తెచ్చిన నలభైరాళ్లూ, చేసిన అప్పులికి సరిపోతే, మళ్లీ ఉద్యోగం దొరికేదాకా ఏం తిని బ్రతుకుతాం? చెప్పండి? తినేతిండి అన్నం ఇలా కాళ్లదన్నుకుంటే ఏం చేసేది?" అంది.

ఆమెమనస్సులో ఊహాతరంగాలు వెల్లువలై ప్రవహిస్తున్నాయ్. రాబోయే భయంకరమైన సమస్యను ఎలా ఎదుర్కొనడమా అన్న భయం, ఆవేదనా ఆమెముఖంలో ప్రస్ఫుటంగా కనబడ్డాయి. ఒక్కసారి తన బాల్యజీవితం, తలిదండ్రులూ, ఊరూ—అన్నీ జ్ఞాపకం వచ్చాయి. తను మూర్తినే చేసుకుంటా నని పట్టుబట్టినప్పుడు తండ్రి అన్న మాటలు జ్ఞాపకంవచ్చాయి. 'చూడమ్మా, వెనకాల యేమీ ఆస్కారం లేక, ఉండటానికి స్వంతఇల్లయినా లేక, రెక్కలమీద ఆధారపడి జీవించవలసిన, అతన్ని చేసుకుని నువ్వేం సుఖం అనుభవిస్తావు?'

అప్పుడీమాటలు తన బుర్రకేమీ ఎక్కలేదు. అప్పుడు తన కళ్లకి మూర్తే సర్వస్వంగా కనుపించాడు. విద్యార్థి జీవితంలోనే, మూర్తిని, శారద మనసారా ప్రేమించింది. మూర్తిని ఆమె కోరి, వలచి, ప్రేమించి, బంధువుల కెవరికీ యిష్టం లేకపోయినా పట్టుబట్టి పెళ్లి చేసుకొంది. మూర్తియొక్క ఉత్తమతలకు జాలూ, తెలివితేటలూ, రూపమూ ఆమెను ఆకర్షించేయి. శారద చదువుకొనేటప్పుడు ఎంతమందో శ్రీమంతులయిన యువకులు ఆమెకోసం తమ భవిష్యత్తుకి నిచ్చెనలు వేశారు. కాని శారద హృదయంలో ఎవరూ స్థానం ఆక్రమించుకో లేకపోయారు. విద్యా, రూపం, గుణాలు మూడూ మూర్తీభవించిన 'మూర్తికి' ఆమె హృదయంలో స్థానం లభించింది. మూర్తినే ఆమె తన ఆరాధ్యదైవంగా ఆరాధించింది. తలిదండ్రుల్నీ బంధువుల్నీ యావన్మందినీ కాదని మూర్తినే వివాహం చేసుకుంది. అతను ఏమీ లేనివాడనీ, రెక్కలమీద బ్రతకవలసినవాడనీ అందులోనూ రచయితలని పెళ్లాడిన ఏ ఆడదీ సుఖపడలేదనీ కావలసిన వాళ్లంతా చెప్పారు. కాని ఆమె వినలేదు. రచయిత అంటే స్థిరబుద్ధి లేనివాడని ఉన్న తానయాలు కలవాడనీ వాళ్ళ భావం. ఉన్న తాకయాలు కలవాణ్ణే దరిద్రం అంటిపెట్టుకుని ఉంటుందనికూడా వాళ్ళ నమ్మకం.

ఎలాగయితే నేం అందర్నీ కాదని అతన్నే పెళ్లాడింది. శారద పెళ్లి అయి మూడుసంవత్సరా లయింది. పెళ్లి అయిన మరుసటిసంవత్సరమే మూర్తి ఒక పంచదారఫ్యాక్టరీలో గుమాస్తాగా చేరాడు. బ్రాహ్మణజన్మ ఎత్తినకారణంగా బి. ఏ. ప్యాసైన తనకి అంతకన్నా గతి దొరకలేదు. ఆ వచ్చే నలభైరూపాయల జీతంతోటే క్లుప్తంగా గడుపుకుంటూ వచ్చేవారు. ఆ స్వల్పఆదాయంతోటే తృప్తి పడుతూ, అన్యోన్యంగా ఆ ఇద్దరూ ఈ భూలోకంలోనే స్వర్గం సృష్టించుకున్నారు.

మూర్తి ఉదయమే ఎనిమిదింటికి ఆఫీసుకు పోయి మధ్యాహ్నం పన్నెండు గంటలకి యింటికి చేరుకొనేవాడు. తిరిగి రెండుగంటలకి ఆఫీసుకు పోయి సాయంత్రం ఆరుగంటలకి ఇంటికి చేరుకొనేవాడు. ఈలోగా శారద తనపనులన్నీ ముగించుకుని ముస్తాబయి వాకిట్లో మూర్తిరాకకోసం ప్రతీక్షిస్తూ కూర్చొనేది. సాయంత్రందాకా పనిచేసి అలసి ఇంటికి చేరుకున్న మూర్తికి వాకిట్లోకి రాగానే కళకళలాడుతూన్న శారదచిరునవ్వుముఖం స్వాగతం ఇచ్చేది. దాంతో దినమంతా పడిన తన శ్రమంతా మరిచిపోయేవాడు మూర్తి. తను తెచ్చే జీతం చాలకుండా బ్రతకడానికి మాత్రమే సరిపోయినా, అనుకూలమయిన ఆ దాంపత్యంముందు తమకి తక్కిన లోటులన్నీ ఆనేవి కావు. ఆకలి దప్పులే ఉండేవిగావు. శారదతండ్రి కాస్త ఇంత సంపాదించినవాడే. తనకి ఆ వొక్క కూతురూ, స్కూలుఫైనల్ చదివే ఇంకో కొడుకూ తప్ప మరెవరూ లేరు. ఆయన భార్య పోయి నాలుగేళ్ళయింది. శారద పెళ్లి అయినతర్వాత ఆయన ఒకసారయినా వచ్చి కూతుర్ని చూడలేదు. తను రమ్మని కోరలేదు. కారణం, ఆ వివాహమే ఆయన కిష్టం లేదు — తనని కాదని మూర్తినే స్వతంత్రంగా పెళ్లిచేసుకున్నకారణంగా తండ్రి ఇప్పటివరకూ, తన గుమ్మం ఎక్కి చూడలేదుగదా, కనీసం, ఉత్తరంముక్కయినా లేదు. కాని ఇప్పటివరకూ ఆ లోటూ ఏమీ కనబడలేదు. అనుకూలుడైన, అన్ని విధాలా నచ్చిన భర్తతో, ఆ వచ్చే స్వల్ప ఆదాయంతోటే, జీవిస్తూన్నా, అదే స్వర్గంలా ఉండేది.

కాని మళ్లీ తన జీవితంలో ఏదో మార్పు రానున్నదనీ, భయంకరమయిన పరిస్థితుల్ని తను ఎదుర్కొవలసివస్తుందనీ ఆమె ఊహించలేదు. అప్రయత్నంగా ఆమెకళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఆ విషయం మూర్తి గ్రహించకపోలేదు. "ఏం శారదా? ఉద్యోగం పోయిందని విచారిస్తున్నావా? నే సీపాటికి ఇంకో ఉద్యోగం సంపాదించనూ? ఏలటానికి ఊళ్లు ఉండవు గాని, ఏరుకుతినడానికి ఊళ్లు ఉండవా? సన్యాసికి ఒక పాయ్యేమిటి? ఇది గాకపోతే మరో కూలిపని? దీని కంత విచారించడం ఎందుకు? నేనప్పుడే ఇంకో కంపెనీలో మాట్లాడే ఉంచాను. రామగోపాల్, కంపెనీలో నెలకు యాభై రూపాయలు ఇస్తామన్నారు. వారంరోజుల్లో తిరిగి చేరతాను. ఈమాత్రం దానికే విచారిస్తే ఎలా?" అన్నాడు ఆమె కళ్లల్లోకి చూస్తూ మూర్తి—

శారద అతిప్రయత్నంమీద లేనినవ్వుని తెచ్చుకుని, "అబ్బే! అందుకా దండీ? మొన్న ప్లీడరుగారి పెళ్లాందగ్గర పుచ్చుకొన్న అయిదూ, పాలవాడికి పదీ, చిల్లరకొట్లో పదీ, చాకలిదానికి అయిదూ, ఇంటిఅద్దె అయిదూ ఇచ్చేస్తే మళ్లీ మీకు ఉద్యోగం దొరికేదాకా, జీతం వచ్చేదాకా, ఏం తింటాం? అదీ నా ఆలోచన" అంది.

"దాని కేమేం వెర్రిదానా? చచ్చిపోతామా? ఏ స్నేహితుణ్ణో ఎక్కణ్ణో, అడిగి బదులుతీసుకుంటాం. మొన్న నేను వ్రాసి పత్రికకు పంపిన కథకి అఘమం అయిదు


## నారసింహలేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, వికారక విస్ఫత్తివ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

కు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ

... ఏ. ఫ కంపెని

... కొల్లాగా జిల్లా.

రూపాయిలైనా, ఆ సంపాదకుడు పంపుతా నన్నాడు. సంవత్సరంబట్టి, ఆ పత్రికకి ఎన్ని కథలు వ్రాశాను? అవాంతరం సహాయం అతనివల్ల జరక్కపోదు." అన్నాడు మూర్తి.

"చాల్లెండి. ఈ కథలు వ్రాయడంవల్లనే మీకీ గ్రహచారం పట్టుకుంది. ఈ దుర్వ్యసనం మానేసే మీరు ఏనాడో బాగుపడే వారు. వెనవకథలు కూడు పెడుతాయా, గుడ్డ పెడతాయా? మీ పిచ్చిగాని. నాలుగేళ్ళబట్టి రాస్తున్నారు. కాగితాలూ, సిరా ఖర్చూ, నిద్రలేక ఆరోగ్యం పాడవటంతప్ప ఏమైనా లాభంవుందా? ఇంకా ఎప్పుడో ఏదో, ఎవరో పంపుతారని ఆశించడం? మీ అమాయకానికి నవ్వాలో యేడవాలో, అర్థంగాకుండా వుంది. ఈ మహా వ్యసనానికి స్వస్తిచెప్పి హాయిగా, ఏదో ఉద్యోగాన్ని నమ్ముకొని, బ్రతక్క ఎందుకొచ్చిన కథలు చెప్పండి? నామీద ఒట్టువెయ్యండి? ఈ రోజు మొదలు కథ వ్రాసి ఏ పత్రికకీ పంపనని." అంది శారద.

మూర్తి నవ్వుతూ, "ఎందుకే అవంటే నీ కంత కోపం? ఏనాటి కయినా శ్రమ ఫలితం దక్కకపోదు." అన్నాడు.

ఇంతలోనే టపాబంట్రోతు వచ్చాడు. మూర్తి గభాలున లేచివెళ్ళి, ఒక కవరు చేత్తో పట్టుకొచ్చాడు. "ఎక్కణ్ణించండీ?" అని అడిగింది శారద. మూర్తి కవరుచించి చదవసాగాడు. క్రమంగా అతని ముఖలక్షణాలు మారిపోసాగాయి. ఆ ముఖంలో ఏదో ఆశ ఎంతో ఉత్సాహం కనిపిస్తున్నాయి.

"ఏమిటండీ ఆ సంతోషం? ఆ దేమిటో నాకు చెప్పకూడదూ?" అంది శారద. "ఏమీ లేదే? మాశావా? 'ఎందుకొచ్చిన కథలు, కూడుపెడతాయా' అన్నావు అవే యీనాటికి నా జీవితంలో క్రొత్తవెలుగు చూపించాయి. భవిష్యత్తుకి నిచ్చెనలు వేశాయి" – అన్నాడు.

"ఏమయిందండీ? ఏమయినా పంపుతామన్నారా?"

"అది కాదే? నాతో చదువుకొన్నవాడే ఒక స్నేహితుడున్నాడు. బాగా డబ్బున్నవాడు. చిన్నప్పట్నించీ మా యిద్దరికీ ప్రాణస్నేహం. అతడు మద్రాసులో క్రొత్తగా ఒక వారపత్రికను స్థాపిస్తున్నాడు. అందులో నన్ను సహాయసంపాదకుడిగా ఉండమనీ, నూటయాభై రూపాయలు జీతం యిస్తాననీ వెంటనే రమ్మన్నాడు.

"ఏమిటీ" అంది శారద – పట్టలేని ఆనందంలో, "రేపే నా ప్రయాణం. ఉదయం మెయిలుకే వెళ్తాను. వెళ్ళి అక్కడ వెంటనే ప్రవేశించి, నెలయిన తరువాత, జీతం తీసుకునివచ్చి నిన్ను తీసికెళ్తాను. ఈ నెల్లాళ్ళూ నువ్వు ఇక్కడ ఒంటరిగా వుండే కంటే, మీ......"

"గ్రహించాను. కాని నేను మావాళ్ళ ఇంటికి వెళ్ళలేనండి? మూడేళ్ళయింది. ఎక్కడున్నావమ్మా? ఏం చేస్తున్నావని అయినా ఉత్తరం రాయలేదు. కన్నతండ్రయినా ఏముఖం పెట్టుకుని వెళ్ళను చెప్పండి." అంది శారద.

"అదేమిటే వెర్రిదానా? ఏదో పెంచి పెద్దదాన్ని చేసిన ఆయనమాట నువ్వు విన్నావుగావని ఆయన అలా మొండికత్తి కోపగించారుగాని. ఈవేళ కాకపోతే రేపయినా, ఆయన తన పొరపాటుని గుర్తించక పోరు. ఈలోపుగా నీఅంతట నువ్వే వెళ్ళి ఈ విషయాలన్నీ, చెప్పి, నేను మద్రాసు వెళ్ళాననీ, ఉద్యోగం దొరికిందనీ, నెల్లాళ్ళలో వచ్చి తీసికెళ్తానని చెప్పు. ఆయన సంతోషిస్తారు. ఇది జీడిబొట్టు కాగూడదా? తుడిచేసుకోడానికి – ఎంత లేదన్నా కన్నతండ్రి. కూతురు గుమ్మంలో కొస్తే కాదంటాడా? నువ్వు కొంచెం ఆలోచించు." అన్నాడు మూర్తి.

శారద గట్టిగా నిట్టూర్చి లోపలికి వెళ్ళిపోయింది. మూర్తి లేచి, భుజంమీద తువ్వాలు వేసుకుంటూ "అలా వీధిలోకి వెళ్ళొస్తాను – కొంచెం ఆలస్యం అవుతుంది. నాకోసం కని పెట్టుకోకు" అన్నాడు.

* * * * *

ఆ మరునాడు ఉదయంబండికే మూర్తి మదరాసు వెళ్ళాడు. వెడుతూ, వెడుతూ, "శారదా, త్వరలోనే వస్తాను సుమీ. నువ్వు అదృష్టవంతురాలివి. ఇదంతా నీ అదృష్టమూ నీ చలవే, వెళ్ళగానే వివరాల్తో ఉత్తరం వ్రాస్తాను జవాబు రాయి. నువ్వుమాత్రం సాయంత్రం బండికే ఇంటికి వెళ్ళు" అన్నాడు. స్టేషనుకికూడా భర్తతో వెళ్ళింది శారద. మూర్తి ఎక్కిన మెయిల్, శారద నిలబడి చూస్తుండగానే వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం ప్యాసింజర్లోనే బయల్దేరి రాత్రి పదిగంటలకి తన పుట్టింటి గుమ్మంవద్ద తలుపు తట్టింది శారద – ఆ యిరు నిముషాలకి తలుపులు తెరచుకున్నాయి తండ్రి వచ్చాడు. అకస్మాత్తుగా వచ్చిన కూతుర్ని చూసి నిర్ఘాంతపోయాడు. మూడు సంవత్సరాలైంది

(34-వ పేజీ చూడండి)

సర్వోత్కృష్టమైన
"కానన్ దేవన్"
టీ మాత్రమే త్రాగండి
KANAN DEVAN TEA
Kanan Devan Tea
Quality Production
ఏజంటు: కర్నూలు, అనంతపురం, కడప & చిత్తూరు జిల్లాలకు
కె. ఎ. జోషి, అనంతపురం.
టోకు వ్యాపారస్తులకు విశేష సౌలభ్యము
వివరములకు నేడే వ్రాయండి.

# ప్రతీక్ష

(11-వ పేజీ తరువాయి)

కూతుర్ని చూసి. అమ్మా! వచ్చావా? అంటూ కౌగిలించుకుని బావురుమన్నాడు తండ్రి. శారద విషయాలన్నీ చెప్పింది. భర్తకు మదరాసులో ఉద్యోగం దొరికిందనీ, నెల్లాళ్ళలో యిల్లూ, అవీ కుదుర్చుకుని, వచ్చి తీసికెళ్తానన్నారనీ, యీ నెల్లాళ్లూ యిక్కడే ఉండామని వచ్చాననీ, ఇంకా ఏవేవో చెప్పింది. అన్నీ విన్నాడు తండ్రి.

"ఏమోనమ్మా! ఉద్యోగమే తగలెడతాడో, వుంచే పెట్టుకుంటాడో? అతని మాటల్లో నాకేం నమ్మకం లేదు. అతడెందుకూ పనికిరాడనే నా విశ్వాసం. ఆ తర్వాత నీ అదృష్టం" అన్నాడు తండ్రి.

తండ్రిమాటలు శారద హృదయాన్ని ఎంతో గాయపర్చాయి. డబ్బులేనివాడు గాబట్టి, తన భర్తని తండ్రి అంత నీచంగా అగౌరవంగా మాట్లాడుతున్నాడు. వెధవ డబ్బు! పాకీది సంపాదిస్తోంది. మనిషి అంటే ఇంత తేలికా అనుకుంది. మరి జవాబు చెప్పలేదు శారద.

రోజులు గడచిపోయాయి. మూర్తి వెళ్లి అప్పడే యిరవై రోజులైంది. ఆనాడే వచ్చింది ఉత్తరం. ఉద్యోగంలో కుదిరాడనీ, ఇల్లుకూడా చూశాడనీ, విదియా సోమవారం వస్తున్నాడనీ, తీసికెళ్లడానికి. — శారదా, తండ్రీ, యిద్దరూ చూశారు.

శారద, "మాశావా? నాన్నా! నా మాటలు నమ్మవు కావు? ఇప్పుడైనా నమ్మకం కలిగిందా? రత్నం ఎంతకాలం రాళ్లలో పడివున్నా అది ఏనాటికయినా, ఎవరిచేతనయినా గుర్తింపబడకపోదు" అంది. తండ్రి మౌనంగా పెదవి విరిచాడు సమాధానంగా— ఆరోజు గడచిపోయింది.

విదియా సోమవారం శారద మనస్సెంతో ఉత్సాహంగా ఉంది. మూర్తి మెయిల్ దిగితే, రెండుగంటలకల్లా ఇంటికి వస్తాడు. తన భర్తతో మద్రాసు వస్తుంది. మద్రాసులో ఎంతో హాయిగా ఉంటుంది. తాను ఎంతోకాలంనుంచి ఊహించి, కన్న కలలన్నీ నిజమయ్యే దినాలు సమీపిస్తున్నాయి. జీవితంలో కష్టాలూ, ఆపదలూ, మనుష్యులకు రాకపోతే మానులకు వస్తాయా. నిజంగా మూర్తి ఎంత మంచివాడు? సంసారంలో ఆర్థికబాధలవల్ల అప్పుడప్పుడు అతన్ని నొప్పించేమాటలుకూడా తననోట జారేయి. కాని అవేవీ తమ మనస్సులో పెట్టుకోనేలేదు. తనకిమాత్రం సంపాదించుకోవాలనీ నలుగురిలాగా గౌరవంగా బ్రతకాలనీ, పెళ్ళాన్ని సంతోషపెట్టాలనీ లేదాయేం? ఏదో గ్రహచారవశంవల్ల ఇన్నాళ్లబట్టీ సరి అయిన ఉద్యోగం దొరకలేదు. అసలే అభిమానంకల మనిషి. విధిలేకగాని అలాంటి షుగర్ ఫ్యాక్టరీలో మున్షీకో, నల్లభైకో కూలిపని చేసేమనిషేనా మూర్తి? ఎంత తెలివయినవాడు? ఎటువంటి ఉన్నతభావాలు కలవాడు? అతను మనస్సులో ఎంతో ఖేదపడుతూనే వుండేవాడు: తన సంపాదన నిత్యజీవితాన్నే ధైర్యంగా యెదుర్కోడానికి చాలడంలేదనీ తనమీద ఎన్నో ఆశలూ కోరికలూ పెట్టుకుని తనవాళ్ళందర్నీ కాదని తన్నే ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యని సంతోషపెట్టలేకపోతున్నాననీ కాని ఏం చేస్తాడు. దేనికయినా రోజులు రావాలిగదా. ఈమాత్రం జ్ఞానం లేక దరిద్రుడనీ స్థిరబుద్ధిలేనివాడనీ, అప్రయోజకుడనీ, సోమరి అనీ, భర్తనుతూలనాడే తండ్రియెడల తనకు అంతకుముందున్న పూజ్యభావం క్రమంగా సన్నగిల్లింది. ఎంత సంస్కారం లేని హృదయం తండ్రిది? క్రమంగా ఆయనలోనూ పరివర్తన రాకపోదు. ఇంక అతనికేం భయం లేదు. లోకం ఏమనుకున్నా తండ్రి ఏమనుకున్నా తనకి లెక్కలేదు. తాను భర్తతో మద్రాసు ఎలాగా వెళ్ళిపోతుంది. తనజీవితం మద్రాసులో ఎంతో శోభగా ఉంటుంది. తనకి చిన్నప్పట్నించీ మద్రాసులో కొంతకాలం ఉండాలని భర్తతో సాయంసమయాల్లో బీచ్‌కి కార్లు చేయాలనీ సినీమాలకు వెళ్ళాలనీ "ఫలానా మూర్తిగారి భార్య ఈమె" అని నలుగురూ అనుకోవాలనీ ఆమె కోరిక. అప్పుడే ఒంటిగంటయింది. ఇంకో గంటకల్లా మూర్తి వస్తాడు. స్టేషన్లో దిగి జట్కాలో రావాలి. వచ్చేసరికి బహుశా మూడవచ్చు. కాఫీనీళ్ళు పెట్టి స్నానానికి వేడినీళ్ళు తోడి, సబ్బుబిళ్లా తువ్వాలూ, సిద్ధంగా వుంచింది. క్రమంగా ఆమె ఆలోచనలతోనే మూడయింది. టయిము సమీపిస్తోంది. నాగడ ఒకసారి లోపలికివెళ్లి అద్దంలో చూసుకుని ఇవతల కొచ్చింది. భర్త బండిదిగి రాగానే తనని చూసి ఆశ్చర్యపోవాలి. అంతలా ఆమె ఎప్పుడూ అలంకరించుకోలేదు—ఇంకా బండిరాలేదేం చెప్మా? ఒకవేళ నేరుగా వస్తున్నడేమో? ఆమె ఆలోచిస్తూంది. తండ్రి పొలంలోకి కాబోలు బయల్దేరుతూ, "అలా పొలంలోకి వెళ్తోస్తానమ్మాయ్! ఏమిటో వెర్రిదానివి; వాడి మాటలు నువ్వు నమ్మి మోసపోతున్నావు. ఈవేళ వస్తాడనే నీ పిచ్చి నమ్మకం. బహుశా రాడు. నాకు నమ్మకం లేదు. వస్తే మాత్రం సంతోషమే. నేను పొలంలోకి వెళ్లానని చెప్పు" అంటూ వెళ్లాడు.

పొరుగింటి శ్యామల వచ్చి శారదని చూసి, "ఏవమ్మాయ్! బలే కులాసాగా ఉన్నావ్? మీ ఆయనగారు ఇవ్వాళే వస్తారా ఏమిటి? మదరాసువెళ్లి మమ్మల్నందర్నీ మరచిపోతావు కాబోలు?" అంది.

చాల్లేవే! నువ్వుమాత్రం వెళ్లవా యేమిటి? నీమొగుడితో హైదరాబాదు" అంది శారద.

ఇంతట్లోనే ఎర్రసైకిలు ఒకటి ఆ ఇంటి ముందు ఆగింది.

"కామేశంపంతులుగారు" టెలిగ్రాం అన్నాడు పోస్టుమన్.

"ఏదీ ఇలా ఇయ్యి—ఏమిటి? టెలిగ్రామా! ఎక్కణ్ణుంచి?"

అంటూ చించింది శారద కవరు. ఇంగ్లీషులో కామేశంపంతులు, రామనగరం, మీ అల్లుడుమి, స్తర్ జె. ఎస్. మూర్తి గతరాత్రి సూళ్లూరుపేట మెయిల్ ప్రమాదం కారణంగా క్షతగాత్రులయి హాస్పిటల్లో చేర్చబడి మరణించినవారిలో ఒకడుగా గుర్తింపబడినాడు. జేబులోని రికార్డువల్ల అడ్రసు గుర్తింపబడినది. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్" అని వుంది. శారద నిలువునా కొయ్యబారిపోయింది.

* * *

అప్పటినుంచి ఇప్పటివరకూ వరండాలో సాయంత్రం ఆరు గంటలనుంచి రాత్రి తొమ్మిది గంటలవరకూ శారద మూర్తికోసం ప్రతీక్షిస్తూనే వుంది. కాని మూర్తి ఇప్పటి వరకూ రాలేదు.

ఉత్తమ శైవమత గ్రంథము
పండితారాధ్యచరిత్ర
వెల రు 5-0-0 లు
ప్యాకింగి పోస్టేజి రూ. 1-4-0.
ఆంధ్ర గ్రంథమాల
పోస్టుబాక్సు 212, మదరాసు 1.